క్లుప్తంగా

నేడు దువ్వాడ నామినేషన్

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్‌ను వేయనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు టెక్కలి వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచిలి: మండల పరిధిలోని రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు చేపట్టనున్నారు. దీంతో శుక్రవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు స్థానిక ఏఈ ఎన్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి కంచిలి వరకు ఉన్న లైన్‌లో సాంకేతిక లోపాలను సరి చేస్తున్నందున కరెంటు సరఫరాను నిలిపివేస్తామని.. దీన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్లు, స్తంభాల మార్పు పనులను చేపడుతున్నారు. దీంతో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలు గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖాధికారులు జి.ప్రసాద్, ఎల్.యోగి తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పలాస: పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం పది గంటల నుంచి రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, కాశీబుగ్గ శివరామ మెడికల్, డాక్టర్ ప్లాజా ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తామని జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ రాపాక తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి సీదిరి ఎన్నికల ప్రచారం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. మధ్యాహ్నం వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట పంచాయతీ పరిధిలో, సాయంత్రం పలాస మండలం అమలకుడియా పంచాయతీ పరిధిలోని గ్రామాలైన వీరబద్రాపురం, అమలకుడియా, పూర్ణబద్ర గ్రామాలు,కాలనీలలో ఎన్నికల ప్రచారం చేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వండి రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఏ, బీకాం గ్రూపుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

టెక్కలి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి సంబంధించి పూర్తిస్థాయిలో అధ్యాయనం చేసి 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక తయారు చేయాలన్నారు. సమావేశంలో డీపీఆ ర్సీ పేడాడ ఆనందరావు, ఈవోపీఆర్‌డీ బి.మల్లేశ్వరరావు ఉన్నారు.

రేకుల షెడ్ నిర్మాణానికి విరాళం

సోంపేట: సోంపేట పట్టణంలోని జలంత్ర హరిజన వీధిలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయానికి రేకుల షెడ్, ఐరన్ గ్రిల్ నిర్మాణానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు విరాళం అందజేశారు. వీటి ఏర్పాటు పూర్తికావడంతో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావును గురువారం అభినందించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా నవమి ఉత్సవాలు



కాశీబుగ్గ: పలాస సీతారామాలయంలో పట్టాభిషేకం ఘట్టం

కంచిలి: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం కంచిలితో పాటు తలతంపర, గోకర్ణపురం, పోలేరు గ్రామాల్లో గురువారం సీతారాములు విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరులో ఉత్సవ విగ్రహాలను ఊరేగించగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మెయిన్ రోడ్డులోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా శ్రీరామ పట్టాభిషేకం జరిగింది. పండితులు పద్మకుమార్‌ఆచారి శ్రీరామపట్టాభిషేకం ఘట్టాన్ని భక్తులకు వినిపించారు.

కాశీబుగ్గ: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారాములకు పట్టాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు దేవాలయాలలో వైభవంగా క్రతువు చేపట్టారు. అనేకమంది దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



పలాస తహసీల్దార్ కార్యాలయం గోడకు నోటిఫికేషన్ పత్రాన్ని అతికిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్



ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నోటిఫికేషన్ పత్రాలు ప్రదర్శిస్తున్న ఆర్వో సుదర్శన్ దొర

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను టెక్కలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ గురువారం విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే 13వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియలో వివిధ అంశాలకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నోటిఫికేషన్‌ను విడుదల చేసి దానిని నోటీస్ బోర్డులో అంటించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ నుంచి నామినేషన్ల తిరస్కరణ, పరిశీలన వరకు అన్ని అంశాలతో కూడిన వివరాలు నోటిఫికేషన్‌లో ఉంటాయని పేర్కొన్నారు. ఏవో నాగరాజు, సహాయ రిటర్నింగ్ అధికారి బాలమురళీకృష్ణ ఉన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్‌దొర గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సంబంధిత ప్రతులను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు అతికించారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఆర్వో చెప్పారు. తహసీల్దార్ ఎం.భాస్కరఅప్పారావు, ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి ఉన్నారు. కాగా తొలిరోజున కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన జన్నెల సూర్య వరప్రసాదరావు రైతు కుల సంఘం తరఫున స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు.

పలాసలో..

పలాస: ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నోటిఫికేషన్ పత్రాలను పలాస ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ స్థానిక తహసీల్దార్ కార్యాలయం గోడకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ప్రతి అభ్యర్థి విధిగా పాటించాలని సూచించారు. పలాస నియోజకవర్గంలో 284 పోలింగు కేంద్రాలు, 2,18,607 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. తొలి రోజు పలాస నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని చెప్పారు.

మేమంతా సిద్ధం సభకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మజ్జి శ్రీనివాస్, ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలిలో ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభకు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం స్థల పరిశీలన చేశారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, నాయకులు చింతాడ గణపతి తదితరులు టెక్కలి శివారు ప్రాంతంలో పోర్టు అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. ఏర్పాట్లను పక్కాగా చేయాలని వై.వి.సుబ్బారెడ్డి, మజి శ్రీనివాస్ నాయకులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే
ఉజ్వల భవిష్యత్తు



కంచిలి: కత్తివరంలో ప్రచారం చేస్తున్న నాయకులు



కవిటి: వరక సచివాలయం పరిధిలో ప్రచారం చేస్తున్న పిరియా విజయ తదితరులు



సోంపేటలో ప్రచారం చేస్తున్న పిరియా విజయ, నాయకులు

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నాయకులు అన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి ఈ విషయాన్ని నిరూపించాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కంచిలి మండలంలోని కత్తివరం గ్రామంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ దుర్గాసి శివ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, పొందూరు శ్రీధర్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, బెందాళం శోభన్‌బాబు పాల్గొన్నారు.



కవిటి: పిరియా విజయకు బొట్టుపెడుతున్న మహిళ

వైఎస్సార్‌సీపీ గెలుపు సంక్షేమానికి పిలుపు

కవిటి: వైఎస్సార్‌సీపీ విజయం సంక్షేమానికి పిలుపని ఇచ్ఛాపురం నియోజకవర్గ అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మండలంలోని వరక సచివాలయం పరిధిలోని పాతవరక, కొత్తవరక తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు కడియాల ప్రకాష్, జల్లు యుగంధర్, పి.నేతాజీ, ఏఎంసీ వైస్ చైమర్మన్ వై.నీలయ్య, బెందాళం జయప్రకాష్, ఎన్ని అశోక్, ఎస్.అశోక్, బద్రి ప్రకాష్, పిరియా కృష్ణారావు, శ్రీకాంత్ పురియా, బి.రాజేంద్రం, బి.జగదీష్, టి.రమణమూర్తి, దేవరాజ్‌పురియా పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట పట్టణంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోదతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఇంటింటా ప్రచారం చేశారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, చేకూరిన లబ్ధిని గమనించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యులు తడక పొడుగు కామేష్, నర్తు జానకీ, ధర్మరాజు, నాయకులు మాష్టీల మంజు, జక్కం ఉదయ్‌కుమార్, కొట్ని శ్రీను, మల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పోలీసు బలగాల ఫ్లాగ్‌మార్చ్



నందిగాంలో ఫ్లాగ్‌మార్చ్‌లో సబ్ కలెక్టర్ నూరూర్ కమార్, కేంద్ర బలగాలు

నందిగాం: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేదని టెక్కలి సబ్ కలెక్టర్ నూరూర్ కమార్ అన్నారు. మండల కేంద్రమైన నందిగాం, కాపుతెంబూరులలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవగాహన కోసం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామన్నారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి, నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్‌అలీ, నందిగాం తహసీల్దారు వి.పద్మావతి, ఎంపీడీవో శివప్రసాద్, ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు తారకేశ్వరరావు, ప్రవీణ్ ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తుకు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నియోజకవర్గస్థాయి పోలీస్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి వంద మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ ర్యాలీలు, వాహనాలు నిలిపివేసేందుకు అనుమతి ఉందన్నారు. ప్రత్యేక అధికారిగా నియమించిన ఎస్ఈబీ జేడీ డి.గంగాధర్ పర్యవేక్షణలో బందోబస్త్ ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఈబీ జేడీ గంగాధర్, ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యుయేల్ రాజ్, హెచ్.మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం రూరల్, పట్టణ, కవిటి, సోంపేట ఎస్సైలు ఎన్.లక్ష్మణరావు, సత్యన్నారాయణ, రాము, బడ్డ హైమావతిలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సత్కారం



లక్ష్మీప్రియను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 29వవార్డుకు చెందిన కోనారి లక్ష్మీప్రియ హెచ్ఈసీ గ్రూపులో 484 మార్కులతో పాసైంది. దీంతో ఆమెను స్థానిక పెద్దలు, గ్రామస్తులు గురువారం సత్కరించి అభినందించారు. అలాగే 24వ వార్డు పురుషోత్తపురం గ్రామానికి చెందిన బద్రి సుదిక్షిత మొదటి ఏడాది బైపీసీలో 427 మార్కులు సాధించడంతో ఆమెను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తిలక్, శ్రీనివాస్ నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి



కమలనాభపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: శ్రీకాకుళం పార్లమెంటరీ, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్‌లు శుక్రవారం నామినేషన్లను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలి రావాలని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు కోరారు. మహసాహెబ్‌పేట పంచాయతీలోని కమలనాభపురం, బోరుమజ్జిపాలెం గ్రామాల్లో మేము సిద్ధం-మాబూత్ సిద్ధం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి చేరుకున్న ఎన్నికల సామగ్రి

- నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన అధికారులు



ప్రత్యేక వాహనంలో వచ్చిన ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13వ తేదీన జరగనున్న పోలింగ్‌కు సంబంధించి టెక్కలి నియోజకవర్గానికి అవసరమైన ఈవీఎంలు, ఇతర సామగ్రి గురువారం టెక్కలి చేరుకున్నాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో వీటిని స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. నియోజకవర్గంలో ఉన్న 315 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అసెంబ్లీ అభ్యర్థి ఓటింగ్‌కు 378 కంట్రోల్ యూనిట్లు, 378 బ్యాలెట్ యూనిట్లు, 409 వీవీ ప్యాడ్‌లు, పార్లమెంట్ అభ్యర్థి ఓటింగ్‌కు సంబంధించి 378 చొప్పున కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, 409 వీవీ ప్యాడ్‌లు వచ్చాయి. ప్రత్యేక వాహనాల్లో వచ్చిన వీటిని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతల సమక్షంలో సీలు తెరిచి వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సహాయ రిటర్నింగ్ అధికారి బాలమురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నుంచి యు.విశ్వనాథం, ఎస్.మోహన్, టీడీపీ నుంచి బి.శేషగిరి, ఎం.పురుషోత్తం, కాంగ్రెస్ నుంచి టీబీజీ గుప్తా, బీజేపీ నుంచి నరేంద్ర చక్రవర్తితో పాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. మొత్తం ఈవీఎంలను పరిశీలించి వాటిని గట్టి బందోబస్తు నడుమ భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఆదేశించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కోటబొమ్మాళి: వంటగ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బంజీరుపేటలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద అగ్నిమాపక అధికారి పి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో వంటింట్లో జరుగుతున్న గ్యాస్ ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాగ్రత్తలను వివరించారు.

సోంపేట: అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు అప్రమత్తంగా ఉండి వెంటనే స్పందించాలని అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు అన్నారు. సోంపేట శ్రీసాయి గ్యాజ్ ఏజెన్సీ గోదాం, బి.ఎస్.ఆర్.పెట్రోల్ బంక్‌లు వద్ద అగ్నిప్రమాదం జరిగేటప్పుడు వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఇచ్ఛాపురం: అగ్నిప్రమాదాల నివారణపై స్థానిక జ్ఞానభారతి సీబీఎస్ఈ పాఠశాలలో సీఈవో జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి ప్రశాంత్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే బలం..జనమే బలగం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి సీదిరి అప్పలరాజు



వజ్రపుకొత్తూరు రూరల్: కిడిసింగిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే తన బలమని.. ప్రజలే తన బలగమని పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. డోకులపాడు, చినవంక, గుళ్లలపాడు, శారదపురం, తాడివాడ, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య జైత్రయాత్రలా సాగిన ఈ ప్రచారంలో ప్రజలు అడుగడుగున అప్పలరాజుకు హారతులు ఇచ్చి పూల వర్షం కురిపిస్తు నిరాజనాలు పట్టారు. డోకులపాడులో మహిళలతో కలిసి మంత్రి అప్పలరాజు కోలాటం ఆడారు. ఇంటింటికీ వెళ్లి మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

కూటమిగా వస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అప్పలరాజు అన్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మనందరి ప్రభుత్వం మళ్లీ రావాలని అన్నారు. ఉద్దాన ప్రాంతంలో 60 ఏళ్ల పాలించిన గౌతు కుటుంబం చేసింది శూన్యమన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ వడ్డి కరుణాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు వడ్డి సరిత, కొయిరి భాగ్యలక్ష్మి, నర్తు లక్ష్మీనారాయణ, నర్తు శేషయ్య, నర్తు ప్రేమ్‌కుమార్, బమ్మిడి మోహన్‌రావు, ఇరోతు హేమంత్, రెయ్యి శ్రీను, విఘ్నేష్, కొయిరి ఢిల్లీరావు, బి.శంకర్‌రావు, ఉన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: దొకులపాడులో మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న అప్పలరాజు

వలంటీర్ల రాజీనామా



కోటబొమ్మాళిలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



టెక్కలి: బొప్పాయిపురంలో రాజీనామా చేస్తున్న వలంటీర్లు

కోటబొమ్మాళి: టీడీపీ, జనసేన పార్టీల నాయకుల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గ్రామ వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని ప్రకటించారు. కోటబొమ్మాళి మండలంలోని వాంద్రాడ, కిష్టుపురం, తర్లిపేట, జర్జంగి, కొత్తపేట సచివాలయం పరిధిలోని 37 మంది వలంటీర్లు మూకుమ్మడిగా గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మండల పరిషత్ సీనియర్ అసిస్టెంటు వెంకటరావుకు అందజేశారు.

సంతబొమ్మాళి: మండలంలోని 140 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సంతబొమ్మాళి, గోవిందపురం, వడ్డితాండ్ర, దండుగోపాలపురం, మేఘవరం సచివాలయ పరిధిలోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలో పమది మంది వార్డు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. 20వ వార్డు రత్తకన్నకు చెందిన పదిమంది తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కి వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి సమక్షంలో అందజేశారు.

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో 20 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కార్యదర్శి ఎ.ఆమరాజుకు రాజీనామాలను అందించారు.

టెక్కలి: బొప్పాయిపురం గ్రామ సచివాలయం పరిధిలో తొమ్మిది మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి, సచివాలయం పరిధి నాయకులు కె.సూర్య, జి.కోదండ, డి.రాము ఆధ్వర్యంలో వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు.